# పారిశ్రామికీకరణతోనే విశాఖ నగరాభివృద్ధి

**- ఎ.అజ శర్మ,** ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

విశాఖ నగరం – అందరిదీ. అదేమిటంటే కొద్ది మంది అత్యంత ధనికులతో పాటు, తీవ్ర పేదరికంలో మగ్గుతున్న వేలాది మంది ప్రజలు, సామాన్య, మధ్య తరగతి వారు ఇక్కడ నివాసం ఉంటున్నారు. గ్రామాలలో బతకలేక పొట్ట చేత పట్టుకుని ఉపాధికై వలస వచ్చిన కార్మికులు, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని కోట్ల రూపాయలకు పడగలెత్తిన కోటీశ్వరులు, భారీ పరిశ్రమలలో ఉపాధికై వచ్చిన మధ్యతరగతి ఉద్యోగులు, వీరందరి అవసరాలు తీర్చే వ్యాపార వర్గాలు నేడు విశాఖ నగర వాసులు. తెలుగు ప్రజలే కాకుండా వివిధ బాషలు, సాంప్రదాయాలకు చెందిన అన్ని రాష్ట్రాల నుండి వచ్చిన ప్రజలు ఇక్కడ స్థిర నివాసం ఏర్పరచుకున్నారు.

పారిశ్రామికీకరణతో పాటే విశాఖ నగరం కూడా అభివృద్ధి చెందింది. ఈ అభివృద్ధి క్రమం గురించి, దీని ఆధారంగా జరిగిన మార్పుల గురించి ఇక్కడ తెలుసుకోవాలి.

**విశాఖ నగరం జనాభా క్రమేణా ఎలా పెరుగుతూ వచ్చిందో కింది పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు.**

| సంవత్సరం | జనాభా | సగటు వృద్ధి రేటు | దేశ జనాభా వృద్ధి రేటు | రాష్ట్ర జనాభా వృద్ధి రేటు |
|---|---|---|---|---|
| 1901 | 40,892 | – | | |
| 1911 | 43,413 | – | | |
| 1921 | 44,711 | – | | |
| 1931 | 57,303 | – | | |
| 1941 | 70,243 | – | | |
| 1951 | 1,10,000 | – | | |
| 1961 | 2,15,000 | 1.05 | 2.02 | 1.56 |
| 1971 | 3,68,000 | 1.53 | 2.28 | 2.90 |
| 1981 | 6,15,000 | 2.47 | 2.35 | 2.31 |
| 1991 | 10,53,000 | 4.38 | 2.06 | 2.42 |
| 2001 | 13,57,000 | 3.04 | 1.74 | 1.46 |
| 2011 | 17,43,000 | 3.86 | 1.30 | 1.10 |
| 2021 | 22,26,000 | 4.83 | 0.97 | |

ఈ జనాభా లెక్కలను పరిశీలిస్తే 1951 వరకు నెమ్మదిగా పెరిగిన జనాభా తర్వాత వేగంగా పెరగడం గమనించవచ్చు. దీనికి ప్రధాన కారణం స్వాతంత్ర్యానంతరం విశాఖ నగరంలో ఒక్కొక్కటిగా నిర్మితమైన ప్రభుత్వ రంగ పరిశ్రమలే.

1971–81 మధ్య నుండి దేశ, రాష్ట్ర సగటు కంటే ఎక్కువ జనాభా వృద్ధి రేటు విశాఖ నగరంలో ఉండడం మనం గమనించవచ్చు. 1991 నుండి ఈ క్రమం మరింత పెరిగి 2001,2011,2021 లలో 4, 5 రెట్లు అధికంగా ఉండడం కూడా గమనించవచ్చు. సాధారణ జనాభా వృద్ధికి తోడు ఉపాధికై అనేక ప్రాంతాల నుండి నగరానికి పెద్ద ఎత్తున ప్రజలు చేరుకోవడం ఈ పెరుగుదలకు ప్రధాన కారణం. తాజాగా భీమిలి, అనకాపల్లి మున్సిపాలిటీలు, అంతకు ముందు గాజువాక, పెందుర్తి లాంటి ప్రాంతాలను గ్రేటర్ విశాఖపట్నంలో విలీనం చేయడం కూడా కారణమే.

48.5 బిలియన్ డాలర్ల స్థూల జాతీయ ఉత్పత్తితో రాష్ట్రంలో అతి పెద్ద నగరంగా విశాఖ ఉంది. 2021లో దేశంలో సంపద రీత్యా 10 వ నగరంగా ఉంది. ఇంతలా విశాఖ నగరం అభివృద్ధి కావడానికి ప్రధాన కారణం ఈ నగరంలో నెలకొన్న పరిశ్రమలే. అందులోనూ ప్రభుత్వ రంగ పరిశ్రమల పాత్రే ప్రధానం. 1933 లో ప్రభుత్వరంగ విశాఖపట్నం పోర్టు మొదలుకుని, షిప్ యార్డ్, డాక్ యార్డ్, బిహెచ్‌పివి, హెచ్‌పి సిఎల్, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, ఎన్ఎస్‌టిఎల్, డిసిఐ, బాబా ఆటామిక్ రీసెర్చ్ సెంటర్, ఎన్‌టిపిసి, ఎన్ ఎండిసి వంటి వివిధ ప్రభుత్వ సంస్థల ఏర్పాటు, తద్వారా ఏర్పడిన మెరుగైన ఉపాధి కల్పన ద్వారానే నగరాభివృద్ధికి సాధ్యమైంది. నగర పరిసర ప్రాంతాలలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఇక్కడే నివాసం ఉంటున్నారు. దీనికితోడు శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరం,

విజయనగరం జిల్లా పూసపాటిరేగ, అనకాపల్లి జిల్లాలోని ఫార్మా సిటీ, అచ్యుతాపురం ఎస్ఇజెడ్ వంటి ప్రాంతాలలోని పరిశ్రమలలో మంచి ఉపాధి కలిగిన ఉన్నత మధ్యతరగతి వారిలో అత్యధికులు విద్య, వైద్యం వంటి సౌకర్యాల రీత్యా విశాఖ నగరంలోనే నివాసం ఉంటున్నారు. ఇది కూడా నగరాభివృద్ధికి సహకరించింది.

నగరంలో పెద్ద స్థాయిలో ఉపాధి కల్పించిన భారీ ప్రైవేట్ పరిశ్రమలేమీ లేవు. ప్రభుత్వరంగ పరిశ్రమల తర్వాత ఉపాధి కల్పించింది ప్రవేటు రంగంలోని చిన్న పరిశ్రమలు. ఈ పరిశ్రమలలో మెరుగైన ఉపాధి పొందడానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి ఎక్కువగానూ, కొంతమంది ఇతర రాష్ట్రాల నుండి విశాఖకు తరలి వచ్చారు. ఈ పరిశ్రమల ద్వారా ఇటు నగర పాలక సంస్థకు, అటు ప్రభుత్వ రంగ ఉద్యోగులకు కూడా ఆదాయాలు బాగా సమకూరాయి. ఈ పెరిగిన ఆదాయాల కనుగుణంగా ప్రజల అవసరాలను తీర్చడానికి సర్వీసు రంగం పెద్ద ఎత్తున విస్తరించింది. నాటి ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఇది అవసరం కూడా. ఈ అవకాశాన్ని వినియోగించుకునే స్థితిలో ఉత్తరాంధ్ర వాసులు లేకపోవడంతో ఈ సర్వీసు రంగంలో ఇతర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున ధనికులు వ్యాపారాలకై వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. ముఖ్యంగా విద్య, వైద్య సంస్థలు, రియల్ ఎస్టేటు, కాంట్రాక్టర్లు, చిన్న పరిశ్రమల యజమానులు, వివిధ రకాలైన వాణిజ్య, వ్యాపారాలు, సినిమా హాళ్లు, హొటళ్లు, సముద్ర ఉత్పతులు, రవాణా, టూరిజం రంగాలన్నింటిలోనికి రాష్ట్రంలో వివిధ జిల్లాల నుండి, ఇతర రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో వ్యాపారస్తులు వచ్చారు.

ఇలా విశాఖ నగరం వేలాది మందిని మెరుగైన ఉపాధికై ఆకర్షించింది. వీటన్నింటి ఫలితంగా నగర రూపురేఖలు, స్వభావమే మారిపోయాయి. ఒకప్పుడు చిన్న మత్స్యకార గ్రామంగా ఉన్న నగరం ఉమ్మడి రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద నగరంగా అభివృద్ధి చెందింది. రాష్ట్ర విభజన తరువాత, ఆంధ్ర రాష్ట్రంలో 22 లక్షలు పైగా జనాభాతో అతి పెద్ద నగరం ఇదే.

అయితే 1991 తరువాత మార్పులు వేరేగా ఉన్నాయి. సరళీకరణ విధానాలతో ప్రభుత్వ రంగ పరిశ్రమలు క్రమేణా బలహీనపడే ప్రక్రియ ప్రారంభమవడంతో, మెరుగైన ఉపాధి గురించి వచ్చే కార్మికులు కాకుండా వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో, గ్రామాల నుండి నెట్టివేయబడ్డ ప్రజలు వివిధ అసంఘటిత రంగాలలో ఉపాధికై నగరానికి వలసలు వస్తున్నారు. వీరిలో అత్యధికులు ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందినవారే. 1991 తరువాత విశాఖ జనాభా పెరుగుదలకు మరో ప్రధాన కారణం శివారు ప్రాంతాలను విలీనం చేయడం. దీనివల్ల నేడు విశాఖ నగరం జనాభా రీత్యానే కాక, వైశాల్యం రీత్యా కూడా పెద్దదిగా ఉంది. 1858లో మునిసిపాలిటీగా ఏర్పడి, 1979లో కార్పొరేషన్‌గా రూపాంతరం చెందింది. 2015లో గ్రేటర్ విశాఖపట్నంగా మారింది. నేడు 681.96 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఢిల్లీ (1484 చ.కీ), బెంగుళూరు (709.చ.కీ) తరువాత దేశంలోనే విస్తీర్ణం రీత్యా మూడవ పెద్ద నగరంగా ఉంది. విశాఖ నగరానికి వచ్చిన వారిలో 1991 వరకు మంచి ఉపాధికై రావడం, 1991 తరువాత గ్రామాల నుండి ఉ పాధికై నెట్టివేయబడ్డ వారు రావడం మనం గమనించవచ్చు.

ఈ నగరాభివృద్ధి అంతా మొత్తంగా చుస్తే, ఉత్తరాంధ్ర అభివృద్ధికి సహకరించడం కంటే, పెట్టుబడి కొంతమంది సంపన్నుల వద్ద పోగుపడడానికే ఎక్కువగా ఉపయోగపడింది. ప్రొఫెసర్ కెఎస్ చలం, డాక్టర్ బి గంగా రావు పరిశోధన ప్రకారం ఈ పెట్టుబడి కేంద్రీకరణ క్రమం 1983 లో రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీ ఏర్పాటు తరువాత మరింత ఊపందుకుంది. 42 శాతం మంది ప్రజలకు సాలుకు 24 వేల రూపాయల కంటే తక్కువ ఆదాయం పొందుతున్నారు. 96 వేల రూపాయల కంటే ఎక్కువ ఆదాయం కలిగిన వారు కేవలం 13 శాతం మాత్రమే. నగర జనాభాలో 53.98 శాతం బిసిలు, ఎస్‌సిలు 9.80 శాతం, ఎస్‌టిలు 0.51 శాతం, 34.95 శాతం ఉన్నత సామాజిక తరగతులకు చెందినవారున్నారు. అయితే, వీరి ఆదాయాలలో మాత్రం వ్యత్యాసం ఎక్కువగా ఉంది. 71 శాతం ధనవంతులు ఉన్నత సామాజిక తరగతులకు చెందినవారు కాగా, 70 శాతం పేదలు వెనుకబడిన తరగతులకు చెందినవారు. బిసి, ఎస్‌సిలలో అత్యధిక మంది దారిద్రరేఖకు దిగువ తీవ్ర పేదరికంలో ఉన్నారు.

గతం నుండీ వున్న ఈ సంపద వ్యత్యాసాలు రాష్ట్ర విభజన తరువాత మరింతగా పెరుగుతున్నాయి. రాష్ట్రంలోని సంపన్నులు గతంలో ఎలాగైతే హైదరాబాద్ ను తమ వ్యాపార విస్తృతికి ఉపయోగపెట్టుకున్నారో, నేడు విశాఖ నగరం అలాగే ఉపయోగపడుతోంది. ఫలితంగా తీవ్ర అసమానతల నగరంగా విశాఖ నేడు రూపుదిద్దుకుంటోంది.

అధికారంలోనికి వచ్చిన వరుస ప్రభుత్వాలు విశాఖ నగరాన్ని అభివృద్ధి చేయడం, మంచి ఉపాధి కల్పించడం వంటి చర్యలకు కాకుండా ఈ నగరాన్ని తమ అనునాయులకు దోచిపెట్టడమెలా అనేదానిపైనే తమ అధికారాన్ని కేంద్రకరిస్తున్నాయి. ఫలితంగా వనరులు, భూములు పెద్దఎత్తున అన్యాక్రాంతమవుతున్నాయి. సముద్రతీరంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార సముదాయాలు నిర్మిత మవుతున్నాయి. గంగవరం పోర్టులో రాష్ట్ర ప్రభుత్వ 10.39 శాతం వాటాను పూర్తిగా అదానీ కంపెనీకి అమ్మేయడంతో, 2852.56 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా రాష్ట్ర ప్రభుత్వం అదానీకి దారాదత్తం చేసింది. ఇందులో 1400 ఎకరాలు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు చెందినదే. 9వేల ఎకరాలకుపైగా పంచగ్రామాల భూమిపై, లేని వివాదాన్ని ప్రభుత్వమే సృష్టించి, సామాన్య ప్రజలను బలిచేస్తూ, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోంది. గాజువాక ఇనాం భూసమస్యను పరిష్కరించడంలో తీవ్ర సాచివేతధోరణి ప్రదర్శిస్తోంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున విశాఖనగర భూములను అమ్మకానికి లేదా తాకట్టు పెట్టడం చేస్తోంది.

ఇవన్నీ నగరంలోని భూములు అన్యాక్రాంతమవడానికి, సామాన్యులకు నిలువ నీడ లేనిస్థితి ఏర్పడడానికి దారితీస్తున్నాయి. విశాఖనగరాన్ని చూసి ఉత్తరాంధ్ర ప్రజలు సంతృప్తి పడేలా వీరికి ప్రయోజనాలు కలగడం లేదు. యువతకు మంచి ఉపాధి అవకాశాలు కల్పించే స్థితిలో నగరాభివృద్ధి లేదు.

నగరంలో గృహ వసతి నేడు ప్రధాన సమస్యగా ఉంది. అందరికీ సొంత ఇంటికల సాకారం లక్ష్యంగా ఏర్పడ్డ విశాఖపట్నం నగరాభివృద్ధి సంస్థ (ఉడా) నేడు ఆ లక్ష్యాన్ని పూర్తిగా విస్మరించి, ఫక్తు రియల్ ఎస్టేట్ సంస్థగా రూపాంతరం చెందింది. నేడు మరిన్ని గ్రామీణ ప్రాంతాలను కూడా ప్రభుత్వం దీని పరిధిలోనికి కలిపి, విశాఖపట్నం మెట్రొపాలిటన్ డవలప్‌మెంట్ ఆథారిటీ (విఎంఆర్డిఏ)గా మార్పు చేసి, మరింత పెద్ద స్థాయిలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ప్రణాళికలు రూపొందించింది. పార్కులు, కళ్యాణ మండపాలు, ప్రభుత్వ స్థలాలు- సర్వం ప్రవేటు పరం అనేది ప్రభుత్వ విధానంగా మారిపోయింది. ప్రభుత్వాల ఈ చర్యలన్నీ విశాఖ నగరాన్ని సామాన్యుల నగరంగా కాక, సంపన్నుల నగరంగా మార్చి వేస్తున్నాయి.

## సంస్కరణల ప్రభావం

1991 నుండి దేశంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న వరుస ప్రభుత్వాలు అవలంభిస్తున్న నయా ఉదారవాద విధానాల ప్రభావం విశాఖనగరంపైన కూడా చాలా తీవ్రంగానే పడింది.

ప్రధానంగా ఐదు రకాల ధోరణల రూపంలో ఇది వ్యక్తమవుతోంది.

**మొదటిది** విశాఖ ప్రభుత్వ రంగ పరిశ్రమలు బలహీన పడడం

**రెండవది** ప్రభుత్వం వివిధ అవసరాల పేరుతో పెద్దఎత్తున భూసేకరణ చేయడం, సహజవనరులు పరాధీనం కావడం రూపంలో కనబడుతోంది.

**మూడవది** వేల సంఖ్యలో నిర్వాసితులవుతున్న రైతులు, మత్స్యకారులు, ఇతర వృత్తిదారులు, వ్యవసాయ కార్మికులు, ఇతర పేద ప్రజలు.

**నాలుగవది** శ్రామికులు పూర్తిగా ముక్కలు చేయబడి, చీలకలు, పేలికలయి పోవడం, తద్వారా అభివృద్ధి నుండి పూర్తిగా బయటకు నెట్టబడడం.

**ఐదవది** వ్యవసాయం నిర్లక్ష్యం చేయబడడం.

ఈ ఐదింటి ప్రభావంతో అభివృద్ధి పేరున ఉత్తరాంధ్రతో పాటు విశాఖనగర వనరులు ఒక పక్క కొల్లగొట్టుకు పోబడుతుంటే, మరోపక్క ప్రజలు తీవ్ర పేదరికంలోకి నెట్టబడుతున్నారు. జరుగుతున్న అన్యాయంపై సంఘటితంగా గళమెత్తవలసిన సమయంలో అణగారిన ఈ తరగతుల ప్రజలు ముక్కలు, చెక్కలవడం వీరి కష్టాలను మరింత పెంచుతోంది. పాలకులు నిరంతరం వల్లించే సమ్మిళిత అభివృద్ధి (Inclusive growth) కేవలం కాగితపు ముక్కలాగే మిగిలింది. ఫలితంగా ఇటీవల కాలంలో అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు చేపట్టినా, వాటి వల్ల ప్రజలకు మేలు జరగకపోగా, కీడే ఎక్కువ కలిగింది. ప్రజల ఉపాధి, జీవన సరళి, పర్యావరణం వంటి అనేక రూపాలలో ఇది వ్యక్తమవుతోంది. ప్రశాంతంగా వుండే ఈ ప్రాంతంలో భూ ఆక్రమణలకై మాఫియా సంస్కృతి క్రమంగా పెరుగుతోంది. హత్యలు, సెటిల్ మెంట్లు చేసే గ్యాంగులు కూడా తయారవుతున్నాయి.

సుమారు ఐదు వేల మందికి ఉపాధి కల్పిస్తూ, అత్యంత లాభాలతో నడుస్తున్న హిందూస్థాన్ జింక్ పరిశ్రమను 2003లో నాటి కేంద్ర వాజ్‌పాయ్ ప్రభుత్వం వేదాంత బహుళ జాతి కంపెనీకి అమ్మేసింది. ఆ యాజమాన్యం 2013లో దీనిని పూర్తిగా మూసివేసింది. ఇప్పుడు యాజమాన్యం 365 ఎకరాల ఆ స్థలంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి పూనుకుంది.

సరళీకరణ విధానాలలో భాగంగా ప్రభుత్వ సంస్థలన్నింటిలోను శాశ్వత నియామకాలు దాదాపు తగ్గించ బడ్డాయి. దీనికితోడు ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రవేటీకరించడం, బలహీనపరచడం జరగడంతో, ఉన్నవారికే ఉపాధి అనిశ్చితంగా మారింది. ప్రభుత్వమే శాశ్వత ఉపాధికల్పన స్థానంలో ఎటువంటి ఉద్యోగ భద్రతలేని కాంట్రాక్టు పద్దతి చట్టబద్దం చేయడంతో క్రమేణా శాశ్వత ఉపాధి తగ్గి, తక్కువ వేతనాలకు పనిచేసే అసంఘటిత రంగం బాగా పెరుగుతోంది.

**వివిధ ప్రభుత్వ సంస్థలలో ఈకాలంలో వచ్చిన మార్పును పట్టికలో గమనించవచ్చు.**

| | | పర్మనెంట్ కార్మికులు | | | | కాంట్రాక్టు కార్మికులు | |
|---|---|---|---|---|---|---|---|
| వ.సం | పరిశ్రమ | 1991 | 2012 | 2021 | 1991 | 2012 | 2021 |
| 1. | విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ | 18,744 | 18,079 | 11,300 | 3000 | 9633 | 14000 |
| 2. | విశాఖపట్నం పోర్ట్‌ట్రస్ట్ | 13,019 | 4,758 | 2,700 | 3,500 | 10,000 | 10,000 |
| 3. | డిఫెన్స్ | 8,090 | 7,197 | 7,000 | 1,000 | 4,000 | 7,000 |
| 4. | హిందూస్థాన్ షిపియార్డ్ | 6,795 | 2,448 | 530 | 1,200 | 5,000 | 1,500 |
| 5. | హెచ్‌పిసిఎల్ | 1,512 | 1,318 | 550 | 1,864 | 3,280 | 13,000 |
| 6. | బిహెచ్‌పివి | 4,000 | 1,250 | 550 | 400 | 350 | 350 |
| 7. | ఎన్‌టిపిసి | 500 | 500 | 221 | 800 | 1000 | 1,500 |

ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రైవేటు రంగ సంస్థలలో కూడా అనేక పెద్ద మార్పులే చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వ రంగం తరువాత ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పిస్తున్న చిన్న, మధ్య తరహా పరిశ్రమలు అనేకం నేడు ప్రభుత్వ విధానాల వల్ల కునారిల్లుతున్నాయి. నగరంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్, గాజువాక ఆటోనగర్ లు ప్రధాన పారిశ్రామిక వాడలుగా ఉన్నాయి. వీటిలో అత్యధిక పరిశ్రమలు నేడు ప్రభుత్వ సహకారం లోపించడం, పెద్ద పరిశ్రమల నుండి పోటీ వంటి వివిధ కారణాలతో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఈ స్థితిలో సహజంగానే వీటి నుండి ఉపాధి కల్పన కూడా గతంతో పోలిస్తే క్రమేణా తగ్గిపోతోంది. పెద గంట్యాడ, గంభీరం, పెందుర్తి వంటి ప్రాంతాలలో కొన్ని పరిశ్రమలు నడుస్తున్నా చెప్పుకోదగ్గ ఉపాధి కల్పనేమీ లేదు.

ఆర్భాటంగా ప్రకటించిన ఐటి రంగంకు అనుకున్నంత ఊపు మాత్రం కలగలేదు, సరికదా అతి పెద్దదిగా ఉన్న హెచ్ఎస్బిసి సంస్థ ఎత్తివేయబడింది.

ఇలా ప్రభుత్వ రంగం బలహీనపడడం, చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఒడిదుడుకులకు లోనవడం, ఐటి రంగం అనుకున్నంత స్థాయిలో అభివృద్ధి కాకపోవడం, అవకాశాల మేరకు కూడా టూరిజం రంగం కూడా అభివృద్ధి కాకపోవడంతో, సరళీకరణ విధానాల తరువాత నగరంలో మంచి ఉపాధి కరువై, ప్రజల జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

ప్రధాన మార్పు ఏమిటంటే, ఈ కాలంలో నగరానికి ఆనుకుని ఉన్న గ్రామీణ ప్రాతంలో నూతనంగా వస్తున్న పరిశ్రమల ద్వారా తక్కువ ఉపాధి, తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత లేని ఉపాధి మాత్రమే లభిస్తోంది. వస్తున్న ఉపాధి కంటే కూడా భూసేకరణ వల్ల ఉపాధి కోల్పోతున్న రైతులు, వృత్తి దారులే అధికం. వీటిలో కూడా అత్యధికం కాలుష్య కారక పరిశ్రమలే.

స్థూలంగా ఈ నూతన ప్రైవేటు పరిశ్రమలలో అత్యధికం గ్రామీణ ప్రాంతాలలోనే రావడం గమనార్హం. విశాఖ జిల్లా లోని నక్కపల్లి, అచ్యుతాపురం,పరవాడ ప్రాంతాలు, విజయనగరం జిల్లాలోని పూసపాటిరేగ, శ్రీకాకుళం జిల్లాలోని పైడి భీమవరం, రణస్థలం ప్రాంతాలలోనే నూతన పరిశ్రమలలో అత్యధికం స్థాపించబడ్డాయి. కొవ్వాడ అణు విద్యుత్ ప్లాంట్ కూడా రణస్థలం మండలం లోనే ఏర్పాటవుతోంది. ఇక్కడ తప్పక గమనించవలసిన విషయం ఏమిటంటే,ఈ ప్రాంతాలన్నీ సముద్ర తీరాలే. అందువల్ల ఈ పరిశ్రమల వ్యర్థాల వల్ల సముద్ర తీరమంతా కలుషితమవడమే కాక, మత్స్యకారులు పెద్ద ఎత్తున ఉపాధి కోల్పోతున్నారు.

కొన్ని ప్రాంతాలలో ప్రజల ఆర్థిక, సామాజిక పరిస్థితులలో వచ్చిన మార్పులను పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన అంశాలు గమనించవచ్చు. వాటిలో మొదటిది భూకమతాల సంఖ్య ఒక పక్క తగ్గుతూ, మరో పక్క ఈ భూమిపై ఆధారపడిన వారి సంఖ్య పెరగడం, రెండోది అదనపు నీటిపారుదల సౌకర్యాలు లేకపోవడం, మూడవది గ్రామీణ పేదరికం పెరగడం. వ్యవసాయ రంగంలో వచ్చిన ఈ మార్పులు ఈ ప్రాంత స్వరూప, స్వభావాలనే మార్చివేశాయి. జనాభా పెరుగుదల రేటులో మార్పు, వలసలు, భూకమతాల సైజులో తగ్గుదల, రైతు స్వతంత్రత కోల్పోయి పరాధీనత పెరగడం, గ్రామీణ నిరుద్యోగం పెరుగుదల, సామాజిక సమస్యలు తలెత్తడం వంటి అనేక రూపాలలో ఇది వ్యక్తమవుతోంది. ఈ మార్పుల క్రమాన్ని కింది పరిశ్రమల స్థాపన తరువాత ఎలా జరిగిందో గమనించవచ్చు.

**గంగవరం పోర్టు** :

2000 సంవత్సరంలో నాటి రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ నుండి 1400 ఎకరాల భూమిని తీసుకుని, మరి కొంత భూమి కలిపి మొత్తం 2852.26 ఎకరాల భూమిని ప్రవేటు రంగంలోనే గంగవరం పోర్టు యాజమాన్యానికి ఇచ్చింది. వాస్తవంగా ఇక్కడి పోర్టును విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ ప్రభుత్వ రంగంలోనే నిర్మిస్తామని తెలిపినా, దాన్ని కాదని ప్రభుత్వం ప్రవేటు రంగానికి ప్రాధాన్యతనిచ్చింది. 3460 కుటుంబాలు ఉన్న ఈ గ్రామం పూర్తిగా మత్స్యకార గ్రామం. వీరంతా స్టీల్ ప్లాంట్కు భూములిచ్చి ఒకసారి నిర్వాసితులయిన వారే. ఈ ప్రైవేటు రంగ పోర్టు రాకను వ్యతిరేకిస్తూ ఆనాడు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పోరాడారు. ప్రభుత్వం కర్కశంగా ఆ పోరాటాన్ని అణచివేసింది. 2006 మార్చిలో పోలీసు కాల్పులలో ఒక మత్స్యకారుడు ప్రాణాలు కోల్పోయాడు. అనేక మంది నాయకులను ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయించి నెలల తరబడి జైళ్లలో నిర్బంధించింది. జెట్టి నిర్మాణం, స్థానికులకు ఉపాధి, నష్టపరిహారం వంటి హామీలను యాజమాన్యం ఇచ్చింది. అయితే, ఒక్క హామీ కూడా సంపూర్ణంగా అమలు కాలేదు. జెట్టి నిర్మాణం కూడా జరగలేదు. ఉపాధి కోల్పోయిన వారిలో పది శాతం మందికి కూడా యాజమాన్యం ఉద్యోగాలివ్వలేదు. ప్రభుత్వం 771 మందిని ఉపాధికి అర్హులుగా గుర్తించగా వచ్చిన ఉపాధి మాత్రం 200 మందికి లోపే. అది కూడా నెలకు 4 నుండి 6 వేల రూపాయల లోపు వేతనం వచ్చే అసంఘటిత రంగంలోనే. వీరిలో కూడా నేడు అత్యధిక మంది పనిలో లేరు. ఫలితంగా ఒకప్పుడు వేట ద్వారా హుందాగా బతికిన మత్స్యకారులు నేడు తరతరాల సాంప్రదాయక వృత్తి కోల్పోయి, నిష్ట దరిద్రులుగా జీవిస్తున్నారు.

వీటన్నింటివల్ల అనేక సామాజిక సమస్యలు కొత్తగా తలెత్తుతున్నాయి. అనేకమంది భవన నిర్మాణ కార్మికులుగా, ఆటోలు నడుపుకోవడం, ఇతర రోజువారీ కూలి పనులకు వెళ్లడం, మహిళలు సుదూర ప్రాంతాలకు వెళ్లి చేపలు అమ్ముకోవడం వంటి పరిణామాలు జరిగాయి. ఎన్నడూ నేరాలు జరగని ఈ గ్రామంలో ఉపాధి పోవడంతో దొంగతనాలు భారీగా పెరిగాయి. ఇతర నేరాలూ పెరిగాయి. ఇలా ఈ పోర్టు రాక వల్ల వీరికి మంచి వీసమెత్తు కూడా జరగలేదు కానీ, ఉన్న వేట వృత్తి పోయింది. కొంతమందిని నేరస్థులుగా మార్చివేసింది.

**పరవాడ ఫార్మా సిటీ :**

విశాఖ జిల్లా పరవాడ మండలంలో ఫార్మా సిటీ పేరుతో ప్రభుత్వం 2,500 ఎకరాల సాగు భూమిని సేకరించింది. ఈ మండలంలో సగటు భూకమత విస్తీర్ణం 0.52 ఎకరాలు మాత్రమే. ఈ భూమిలో ఉన్న వారంతా చిన్న రైతులే అవడంతో మొత్తం 9 గ్రామాల నుండి 3540 మంది ప్రజలను వేరే ప్రాంతాలకు తరలించారు. 860 కుటుంబాలు నిర్వాసితులయ్యారు. కొత్త ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కుటుంబానికి కేవలం 90 వేల రూపాయలిచ్చి చేతులు దులుపుకుంది. వీరిలో అత్యధిక మందికి ఇక్కడ ఉపాధి కలగలేదు. ఈ ప్రజలు కూరగాయలు పండించడం, గొర్రెల , మేకల పెంపకం వంటి వృత్తులను కోల్పోయారు. వీరికి ఉన్న ఉపాధి పోవడంతో పాటు, కంపెనీ వెదజల్లే కాలుష్యం వల్ల అనారోగ్యం పాలవుతున్నారు. అప్పుల పాలై భవన నిర్మాణం, ఆటో కార్మికులుగాను, రోజు కూలీలు గానూ ఒకప్పటి ఈ రైతులు మారిపోయేలా ఫార్మా సిటీ రాక చేసింది.

**అచ్యుతాపురం ఎస్ఇజెడ్ :**

విశాఖ జిల్లా సముద్ర తీరంలో ఉన్న అచ్చుతాపురం మండలంలో స్పెషల్ ఎకనామిక్ జోన్ స్థాపనకై రాష్ట్ర ప్రభుత్వం 2001 సంవత్సరంలో 10,700 ఎకరాల భూమిని సేకరించింది. జిల్లాలో సారవంతమైన భూముల్లో ఈ ప్రాంతం ఒకటి. అత్యధిక మంది చిన్న రైతులు. పప్పు ధాన్యాలు ప్రధానమైన పంట. వీరికి నామ మాత్రపు నష్ట పరిహారం మాత్రమే ఇచ్చింది. అది కూడా పెద్ద పోరాట ఫలితంగానే. ఈ భూ సేకరణ వల్ల 27 గ్రామాల నుండి 4,622 కుటుంబాలు నిర్వాసితులుగా మారారు. అనేక మంది వృత్తి దారులకు ఉపాధి పోయింది. వీరికి ఎటువంటి నష్ట పరిహారం కూడా లేదు. వీరెవరికీ ఇక్కడ ప్రత్యేకంగా ఉపాధి కల్పించలేదు. ప్రభుత్వం ఇలా సేకరించిన భూమిలో వెయ్యి ఎకరాల భూమిని ఎకరాకు సాలుకు ఒక రూపాయి చొప్పున బ్రాండెక్స్ అనే ఒక బహుళజాతి కంపెనీకి లీజు కిచ్చింది. ఈ కంపెనీలో సుమారు 20 వేల మంది, అత్యధిక మంది మహిళలు ఎటువంటి హక్కులూ లేకుండా అతి తక్కువ వేతనాలకు పని చేస్తున్నారు. ఈ కంపెనీ వ్యర్థాలు సముద్రంలో కలవడం వల్ల పూడిమడక అనే పెద్ద గ్రామంలోని మత్స్యకారులు వేట వృత్తి కోల్పోయారు. ఇక్కడ కూడా ఒకప్పుడు హుందాగా బతికిన రైతులు, మత్స్యకారులు, ఇతర వృత్తి దారులు నేడు రోజు కూలీలుగా మారిపోయారు. కంపెనీల రాక వల్ల వీరికి మంచేమీ జరగలేదు కానీ, ఉన్న ఉపాధే పోయింది.

నేడు కేంద్ర ప్రభుత్వానికి ఒక పారిశ్రామిక విధానమంటూ లేదు. కేవలం ప్రభుత్వ రంగ పరిశ్రమలను అమ్మేయడం లేదా నేషనల్ మోనిటైజేషన్ పైప్ లైన్ పేరున ప్రభుత్వ సంస్థలను, ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు లీజులకివ్వడం తమ విధానమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 2020-23 పారిశ్రామిక విధాన ప్రకటన ఒకటి చేసింది. అయితే దానిలో ప్రాధాన్యత కలిగిన పరిశ్రమల ఏర్పాటుకు తీసుకునే చర్యలుగాని, యువతకు ఉపాధి కల్పన గురించి గానీ నిర్దిష్టంగా ప్రతిపాదనలు ఏమీలేవు. దీనికితోడు విశాఖ నగరంలోని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వంపై పెద్ద వత్తిడి తీసుకువచ్చే చర్యలు కూడా చేపట్టడం లేదు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఈ విధానాల ప్రభావం భవిష్యత్తులో కూడా నగర పరిశ్రమలపైన, ఉపాధిపైన తీవ్రంగానే ఉంటుంది. సహజంగానే నగరాభివృద్ధిపై కూడా ప్రతికూల ప్రభావమే ఇది చూపుతుంది.

*ప్రత్యామ్నాయం:*

**ప్రభుత్వ రంగ పరిశ్రమలను బలోపేతం చేయడం,**

**చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడం,**

**కాలుష్యకారక పరిశ్రమల స్థానే పర్యావరణహిత పరిశ్రమల స్థాపన,**

**మూతబడ్డ పరిశ్రమలను తెరిపించడం**

**రాష్ట్ర విభజన చట్టంలోని ఉత్తరాంధ్ర ప్రత్యేక అభివృద్ధి పేకేజీ, రైల్వే జోన్, మెట్రో రైలు, విద్యా సంస్థల ఏర్పాటు వంటివి కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం,**

**వంటి చర్యల ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, దీర్ఘకాల అభివృద్ధి సాధ్యమవుతుంది.**